సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



నకిలీ భయం

నకిలీ ఎరువులు, పురుగు మందుల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 8లో▸



ఆశాజనకంగా ఆలు

ప్రస్తుత సీజన్‌లో ఆలు పంట సాగు చేసిన రైతులు అధిక దిగుబడి సాధించి లాభాలు పొందుతున్నారు. 9లో▸



మెరుగైన బోధన చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని మండల విద్యాధికారి వెంకట్ ఆదేశించారు. 9లో▸

సమయం.. ఆసన్నం

సీఎం నోట పంచాయతీ ఎన్నికల మాట

- సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది పూర్తి
- జీపీల్లో కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- జిల్లాలో 594 పంచాయతీలు, 5,058 వార్డులు
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు



వికారాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే.. ఏడాదిగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. రెండు నెలల క్రితం జీపీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేసిన అధికారులు ఇటీవల మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ఎన్నికల బరిలో నిలవాలనుకునే వారిలో ఆశలు రేపాయి. గ్రామ పంచాయతీల ఎన్నికలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయటంతో ముందుగా జీపీ ఎన్నికలకే వెళ్దామనే సంకేతాలు ఇచ్చినట్లయ్యింది. ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకదాని తర్వాత మరో ఎన్నికలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. డీపీఓలు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. పోలింగ్ ఎప్పుడు అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.

పోలింగ్ కేంద్రాల ఎంపిక ప్రక్రియ పూర్తి


జిల్లాలో 566 జీపీలు ఉండగా మండలాల పునర్విభజన అనంతరం వాటి సంఖ్య 585కు చేరింది. ఇటీవల పక్క జిల్లాలు అయిన నారాయణపేట్, మహబూబ్‌నగర్‌ల నుంచి కొన్ని జీపీలు కలవడంతో పంచాయతీల సంఖ్య మరింత పెరిగి 594కు చేరింది. ప్రస్తుతం జిల్లాలో 5,058 వార్డులు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు అదనంగా అవసరం అవుతాయని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఎంత సిబ్బంది అవసరం, ఇంకా చేయాల్సిన ఏర్పాట్లు తదితర వివరాలు సేకరించారు. ఓటర్లను వార్డుల వారీగా విభజించే ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం జాబితాను సిద్ధం చేసి జిల్లా ఎన్నికల అధికారి నుంచి ఆమోదం పొందారు.

మద్దతు కూడగట్టుకునే పనిలో నేతలు

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను వారికే రిజర్వు చేశారు. దీంతో బీసీలకు అన్యాయం జరిగిందనే వాదన కూడా తెరపైకి వచ్చింది.

మండలాల వారీగా వివరాలు

మండలం	జీపీలు	వార్డులు
వికారాబాద్	21	182
ధారూరు	34	286
మోమిన్‌పేట్	29	256
బంట్వారం	12	106
మర్పల్లి	29	264
కోట్‌పల్లి	18	150
తాండూరు	33	290
బషీరాబాద్	39	312
యాలాల	39	318
పెద్దేముల్	38	308
కొడంగల్	25	222
దౌల్తాబాద్	34	298
బొంరాస్‌పేట్	35	292
దుద్యాల్	19	158
పరిగి	32	268
పూడూరు	32	282
కుల్కచర్ల	33	280
చౌడాపూర్	24	202
దోమ	36	308
నవాబుపేట	32	276



సూరీడు సుర్రు..

జిల్లాలో మండుతున్న ఎండలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- యాలాల మండలంలో 37.5 డిగ్రీలు నమోదు
- వారం రోజులుగా ఉక్కపోత శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ

బషీరాబాద్: సూరీడు అప్పుడే సుర్రుమంటున్నాడు. శివరాత్రి కంటే ముందే జిల్లాలో ఎండలు మండుతున్నాయి. గురువారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 37.50 డిగ్రీలుగా నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో ఉక్కపోత మొదలైంది. గతేడాది మార్చి నెలాఖరులో నమోదైన టెంపరేచర్ ఇప్పుడు ఫిబ్రవరి మొదటి వారంలోనే రికార్డు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఎండలు 37 డిగ్రీలు దాటితే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో నమోదయ్యే అవకాశం లేకపోలేదని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. ఎండ తీవ్రతకు మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రాంతాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. పొలం పనులకు వెళ్లే వారు, గని కార్మికులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. శీతల పానియాలకు గిరాకీ పెరిగింది. జ్యూస్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తోంది.

ఉష్ణోగ్రతలు డిగ్రీలలో..

ప్రాంతం	గరిష్టం	కనిష్టం
యాలాల	37.5	18.2
మన్నెగూడ	37.5	15.2
కొడంగల్	37.2	18
తొర్మామిడి	37.1	17.1
మర్పల్లి	37.4	15.9
వికారాబాద్	36.8	17.8
ధారూరు	36.7	18.8
మోమిన్‌పేట్	36.5	16.9
బంట్వారం	36.1	16
తాండూరు	35.9	17.9
దౌలాపూర్	35.9	18.3
పెద్దేముల్	35.5	16.8
నవాబుపేట	35.4	16.5
చౌడాపూర్	35.2	15.7
దుద్యాల్	34.2	16
కుల్కచర్ల	34.9	17
బషీరాబాద్	34.9	17
బొంరాస్‌పేట	34.7	17.7
పరిగి	34.0	16.5

నిబంధనలకు విరుద్ధమైన చికిత్సలు సహించేది లేదు

ఇబ్రహీంపట్నం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీ వైద్యులు చికిత్స చేస్తే సహించేది లేదని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో ఓ ప్రైవేటు క్లినిక్‌లో స్థాయికి మించిన వైద్యం చేస్తున్నారనే సమాచారంతో జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేపట్టారు. కాలం చెల్లిన మందులు, సిరంజిలు, స్టిచ్చింగ్ సామగ్రి, మరికొన్ని నిషేధిత మందులు స్వాధీనం చేసుకున్నారు. అర్హతలు లేకున్నా చిన్న పిల్లలకు, గర్భిణులకు చికిత్స చేస్తున్నారని గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం చర్యలు తీసుకుంటామని, తాత్కాలికంగా క్లినిక్‌ను సీజ్ చేసినట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం నగరం నుంచి పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ 2024 – 25 ధాన్యం సేకరణ, 2023 – 24 సీఎంఆర్ డెలివరీ, రేషన్ కార్డులు, మిల్లర్ల అసోసియేషన్ల బ్యాంకు గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. 2024 – 25 రబీ సీజన్లో 2,25,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా ఉందని, లక్ష టన్నులు సేకరించేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. 2023 – 24 ఖరీఫ్ సీఎంఆర్ వంద శాతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు గోదాంలలో ధాన్యం నిలువలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినా 'కంటి వెలుగై'

- నీరజ్ నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి

షాద్‌నగర్: కొడుకు విగత జీవిగా మారినా అతని నేత్రాలు సజీవంగా ఉండాలన్న ఆశయంతో నేత్ర దానం చేసి తమ ఔదార్యాన్ని చాటారు ఆ తల్లిదండ్రులు. షాద్‌నగర్‌లోని సీఎస్‌కే వెంచర్‌లో నివసించే కోరమోని హరిభూషణ్, భాగ్య దంపతుల కుమారుడు నీరజ్ (15) బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ మందలించాడని భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కన్న కొడుకు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతో నీరజ్ రెండు కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కళ్లను దానం చేసినందుకు ఆస్పత్రి వారు ధ్రువపత్రాన్ని జారీ చేశారు. కాగా, ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం నీరజ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫరూఖ్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న శ్మశానవాటికలో అశ్రునయనాల మధ్య నీరజ్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థి నీరజ్ ఆత్మహత్యకు కారణమైన శాస్త్ర పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని



నీరజ్‌తో తండ్రి హరిభూషణ్ (ఫైల్)

విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీరజ్ ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ గురువారం పట్టణంలోని శాస్త్ర పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలోకి వేళ్లే క్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నీరజ్ మృతిపై సమగ్రవిచారణ చేపట్టాలని, విద్యార్థి చావుకు కారణమైన పాఠశాలపై చర్యలు తీసుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహన్, ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శి ఆకాష్‌సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ జిల్లా కన్వీనర్ సూర్యప్రకాష్, జిల్లా కన్వీనర్ చందు, రాష్ట్ర కో కన్వీనర్ ప్రదీప్ పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కండి

- పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం
- పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ సూచన



పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని, నమ్మకం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రేరణ, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల గడువు దగ్గర పడుతున్నందున సమయం వృథా చేయరాదని సూచించారు. ప్రతి సబ్జెక్టులో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. ప్రేరణ, శిక్షణ తరగతుల్లో సూచించిన మెలకువలు పాటిస్తూ అతి సులభంగా అర్థం చేసుకొని అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. చదువుకు పేద, ధనిక అనేది బేధం లేదని పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమేనని పేర్కొన్నారు. వసతి గృహ విద్యార్థులు తల్లిదండ్రులు గర్వించేలా పేరు తెచ్చుకోవాలని సూచించారు. అబ్రహం లింకన్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. వారంతా పేదరికాన్ని జయించారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, సహాయ సంక్షేమ అధికారులు ఉమాపతి, వీరానందం, శుక్రవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు సునీత మేరీ, మాధవాచారి, వేణుగోపాల్, మోటివేటర్స్ కె.రామచంద్రుడు, కె.మాధవి, మహేందర్, ఉదయ్ కుమార్, గోపీనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐకు 30 పాఠశాలల ఎంపిక

జిల్లాలో పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ స్కీం కింద 30 పాఠశాలలు ఎంపికైనట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద ఆరు ఆదర్శ పాఠశాలలు, రెండు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, రెండు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలు, 18 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైనట్లు వివరించారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థుల కనీస అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ కేంద్రం నిధులను ఖర్చు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

డబుల్ ఇళ్లు పూర్తి చేయండి

జిల్లాలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 851 ఇళ్లు పూర్తయ్యాయని మిగిలిన వాటిని కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నీటి వసతి, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ అధికారి కృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రవన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఐదురోజులు కొనుగోళ్లు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఫసియొద్దీన్



మాట్లాడుతున్న ఫసియొద్దీన్, రమేష్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వారంలో ఐదురోజులు కొనుగోళ్లు జరపాలని నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఫసియొద్దీన్, ది గ్రీన్ అండ్ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు వారంలో రెండు రోజులు మాత్రమే రైతుల నుంచి పంట దిగుబడి కొనుగోలు చేసేవారని, ఇకపై ఆదివారం, మంగళవారం మినహాయించి మిగిలిన అన్ని రోజులు కొలుగోళ్లు చేపట్టనున్నట్లు వివరించారు. రైతుల సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో ఈ–నామ్ పద్ధతిని కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్ పద్ధతిన ఇతర ప్రాంతాల వ్యాపారులు సైతం టెండర్లు వేసి కొనుగోళ్లు చేస్తున్నందున రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఇకనుంచి రైతులు పంట దిగుబడిని ఉదయం 11గంటల లోపు మార్కెట్ గేట్‌లోకి తీసుకురావాలని సూచించారు. మార్కెట్‌లో రూ. 2.30కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి హుమ్నాబాద్ రవి, సూపర్ వైజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి లగచర్లలో భూ సర్వే

దుద్యాల్: మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటులో భాగంగా శుక్రవారం నుంచి లగచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో భూ సర్వే నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు సిద్ధమయ్యారు. గ్రామ సర్వే నంబర్ 102లో 43 మంది రైతులకు చెందిన 47.25 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. వీటికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే తాము భూములు ఇచ్చేది లేదని, తండాలో బడి, గుడి కట్టుకోవాల్సి ఉన్నందున భూములు ఇవ్వలేమని గత సమావేశంలో రైతులు చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అధికారులు నిర్వహించే భూ సర్వే ఏ మేరకు జరుగుతుందో చూడాల్సి ఉంది.

నులిపురుగులను నివారిద్దాం

అడిషనల్ కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10న నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర సుధీర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 2,34,622 మంది ఉన్నారని, వారికి నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరవణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలివ్వండి

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏల వారసుల ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81,85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 169 మంది వీఆర్‌ఏలకు నేటికీ పోస్టింగ్ ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికే 20 మంది వరకు ఉద్యోగం ఇవ్వలేదనే బెంగతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,797 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళన చేస్తున్న వారికి ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పర్వతాలు ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో 61 సంవత్సరాలు పైబడిన వారసుల సంఘం నాయకులు శ్రీనివాస్, లలిత, యాదయ్య, బాల్‌రాజ్, ప్రదీప్, వెంకటయ్య, కుమార్, యాదగిరి, రాములు, శ్రీనివాస్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

లీలా లక్ష్మారెడ్డికి భారత్ గౌరవ్ పురస్కార్

ఆమనగల్లు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి భారత్ వికాస్ సంఘం ఆధ్వర్యంలో అందించే భారత్ గౌరవ్ పురస్కార్‌ను అందుకున్నారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం, భవిష్యత్తు తరాలకు అందమైన ప్రకృతిని అందించాలనే సంకల్పంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాలు, పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ వికాస్ సంఘం అందించే భారత్ గౌరవ పురస్కార్‌కు ఆమె ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా సేడం ప్రాంతంలో భారతీయ వికాస్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంస్కృతి ఉత్సవ్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మజోగాతి చేతులమీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.

తండాల అభివృద్ధికి కృషి

షాద్‌నగర్: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను అభివృద్ధి చేయడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. సమావేశంలో నాయకులు రూప్లా నాయక్, నెహ్రూ నాయక్, శ్రీనివాస్ నాయక్, కొర్ర రవినాయక్, రమేష్ నాయక్, మేఘ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రాజు (ఫైల్)

బొంరాస్‌పేట: మద్యం తాగి చెరువులోకి ఈతకెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటనలో ఎట్టకేలకు మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం కుదురుమళ్లకు చెందిన గంగస్‌పల్లి రాజు(30) ఈ నెల 3న హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తన సమీప బంధువుతో కలిసి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో బొంరాస్‌పేట చెరువులోకి రాజు దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. మూడు రోజులుగా గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చేస్తున్నా ఆచూకీ లభించలేదు. చివరికి గురువారం చెరువు నీటిపై మృతదేహం తేలుతూ బయటకొచ్చింది. ఈ మేరకు శవాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

అనారోగ్యంతో వంట మనిషి ఆత్మహత్య

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మంగళి జంగయ్య(45) ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వంట మనిషిగా విధులు నిర్వహిస్తున్నా రు. కొంత కాలంగా ఆయన కాలేయ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల విధుల నుంచి ఇంటికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో అదే విషయమై విచారం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాసేపటికి కుటుంబ సభ్యులు ఇంటికొచ్చి స్థానికుల సహాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే జంగయ్య విగత జీవిగా పడి ఉన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం మృతుడి కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

వెంటాడుతున్న నకిలీ భయం

- మార్కెట్‌లో ఎక్కువైన నాసిరకం ఎరువులు, పురుగు మందులు
- అవగాహన లేకుంటే రైతన్నకు అపార నష్టం
- అనుమతి ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేయాలని అధికారుల సూచన


దుద్యాల్‌లో ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పురుగు మందులు

దుద్యాల్: ఆరుగాలం శ్రమించి మట్టి నుంచి సిరులు పండించే రైతన్నలకు నకిలీ ఎరువులు, పురుగు మందుల బెడద శరాఘాతంగా మారింది. పంట ఎదుగుదల, చీడపీడల నివారణకు అన్నదాతలు సమయాన్ని బట్టి ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తారు. వీటిలో పెద్దఎత్తున నాసిరకం ఫర్టిలైజర్లు మార్కెట్‌లో చలామణిలో ఉన్నాయి. వాటిని గుర్తించడం రైతన్నకు పెద్ద సమస్యగా మారింది. ఫలితంగా అమాయక కర్షకులు నకిలీ ఎరువులు, పురుగు మందులు వినియోగించి నష్టాలు చవి చూసిన ఉదంతాలు గతంలో అనేకం ఉన్నాయి. గతేడాది జూన్‌లో కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నకిలీ ఎరువులు, పురుగు మందులతో నష్టపోయిన బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలకు చెందిన వందలాది మంది రైతులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. నాసిరకం వరి విత్తనాలతో అప్పుల పాలయ్యామని లబోదిబోమన్నారు. రూ.వేలల్లో నష్టపోయామని తమ గోడును వినిపించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అన్నదాతలు జాగ్రత్తలు పాటించాలి. విత్తనం నుంచి కోత వరకు అన్ని దశల్లో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

అధికారుల తనిఖీలు

మండల, గ్రామ స్థాయిలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలలో వ్యవసాయ అధికారులు సమయానుకూలంగా తనిఖీలు నిర్వహించాలి. తద్వారా నకిలీల బెడద తగ్గే అవకాశం ఉంది. అక్రమాలకు పాల్పడే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి తరచూ రైతులకు అవగాహన కల్పించాలి. మేలైన పంట ఉత్పత్తులు రావడానికి తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు వివరించాలి.

ఇలా చేయాలి

లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, ఏరకం వంటి విషయాలను పరిశీలించాలి. దుకాణాదారుడు, డీలర్ సంతకం చేసిన ఒరిజినల్ బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలును విప్పినట్లు అనుమానం వస్తే వాటిని కొనరాదు. నకిలీలపై రైతులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీవని తేలితే స్థానిక డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

బిల్లులు భద్రపర్చుకోవాలి



ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే ఎరువులు, క్రిమి సంహారక మందులను విక్రయించాలి. అనుమతి లేని, ఇతర కంపెనీలకు చెందిన ఎరువులు, మందులు అమ్మితే దుకాణం సీజ్ చేస్తాం. డీలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాలపై ఉన్న వివరాలను పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలు, సంచులను పంట దిగుబడి చేతికి వచ్చేంత వరకు భద్రపర్చుకోవాలి. – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్

సేద్యంలో మెలకువలు ముఖ్యం

తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్


నాగారంలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్

ధారూరు: నిపుణుల సూచనలు, మెలకువలు పాటించి సేద్యం చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ రైతులకు సూచించారు. మండలంలోని ర్యాల్, నాగారం గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంట పొలాలను వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గురువారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలను సాగుచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పంటల సాగుపై రైతులకు అవగాహన ముఖ్యమన్నారు. వరి పంటలో మొగి పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశిస్తే వాటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, పద్ధతులను ఆయన వివరించారు. వరి పంట అంకుర దశలో ఉన్నప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఫోర్‌జీ గుళికలు, పొట్ట దశలో కార్బోఫ్యురాన్ త్రీజీ గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. ముదురు నారు నాటేటప్పుడు కొనలను తుంచి వేయాలని, ఎకరాకు 3 నుంచి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుల నియంత్రణకు క్లోరంత్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి 0.4 గ్రాములు కలిపి 0.4 మిల్లీలీటర్లు, లేదా ఎమ్మామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటికి 0.4 గ్రాములు కలిపి మొక్క సుడిలో పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

తాండూరులో పట్టపగలే చోరీ

2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 30 వేలు అపహరణ


చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

తాండూరు టౌన్: పట్టపగలే తాండూరు పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చొరబడి 2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.30 వేలను దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాతకుంట విఘ్నేశ్వర కాలనీకి చెందిన కురువ అశోక్ తన భార్యతో కలిసి గురువారం ఉదయం 11 గంటలకు ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. గంటన్నర తర్వాత ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని బీరువా తెరిచి ఉండటంతో పాటు అందులోని 2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.30 వేల నగదు మాయమైనట్లు చెప్పారు. దొంగతనం విషయమై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కాగా ఇంటి బయట పెట్టిన సీసీ కెమెరాలో నిందితుడు దొంగతనం చేసి వెళ్తున్నట్లు కనిపించింది. అంతే కాకుండా ఇదే కాలనీలో ఇటీవల మరో రెండు ఇళ్లల్లో కూడా దొంగతనం జరిగినట్లు సమాచారం.


అనంతగిరి: వికారాబాద్‌లో మాట్లాడుతున్న నాయకులు

15న సెలవు ప్రకటించాలి

గోర్‌సేనా నాయకుల డిమాండ్

అనంతగిరి: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేనా ఉమ్మడి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గోర్ సేనా అధ్యక్షుడు ధనావత్ రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్, నాయకులు రమేష్‌నాయక్, విజయ్‌నాయక్, రాజునాయక్, బన్సిలాల్, బాలోసింగ్, మోహన్, నవీన్, గణేష్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న ప్రభుత్వం సాధారణ సెలవుదినంగా ప్రకటించాలని గోర్‌సేనా సంఘం నాయకుడు రమేష్ రాథోడ్ గురువారం డిమండ్ చేశారు. సేవాలాల్ జయంతిని ఏటా సాధారణ సెలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈనెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించాలన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

బంట్వారం: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న(ఆదివారం) కోట్‌పల్లి మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కె.శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఆసుపత్రి వైద్యులు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి రోగులను పరీక్షిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. సమీప గ్రామాల ప్రజలందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కులగణన బూటకపు సర్వే

బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఒక బూటకపు సర్వే అని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీల సంఖ్య ప్రస్తుతం 46 శాతానికి ఎలా పడిపోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలను తక్కువ జనాభాగా చూపెట్టి, ఓసీలను ఎక్కువగా ఉన్నట్లు చూపెట్టి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడే కుట్రకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెరదీసిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్డిల పాలన కొనసాగుతోందని, తక్షణమే రీ సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మట్టి టిప్పర్ల సీజ్

నవాబుపేట: ఎర్ర మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేసిన సంఘటన మండలంలోని వట్టి మీనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. నార్సింగ్‌కు చెందిన ఓ టిప్పర్ల యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తవ్వి వివిధ ప్రాంతాలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం నార్సింగ్ నుంచి రెండు టిప్పర్లలో ఎర్రమట్టిని మండలంలోని ఓ వెంచర్‌కు తరలిస్తుండగా నవాబుపేట పోలీసులు పట్టుకొని వివరాలు ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేవని తేలింది. దీంతో వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాలాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. యాలా ల నుంచి తాండూరుకు ముగ్గురు ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటో బుధవారం సాయంత్రం మండల పరిధిలోని రసూల్‌పూర్ సమీపంలో అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తాండూరు మండలం జినుగుర్తికి చెందిన సత్యానంద్(42)తో పాటు ఆటోడ్రైవర్ దాసు, పాత తాండూరుకు చెందిన నజీర్, నసీమాలకు గాయాలయ్యా యి. వీరికి తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్ర గాయాలైన సత్యానంద్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం నగరానికి తరలిస్తుండగా బుధవారం రాత్రి మృతి చెందారు. ఆటో డ్రైవర్ దాసు నిర్లక్ష్యంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య రాధిక యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే సత్ఫలితాలు

ఎన్ఐఆర్డీ ప్రొఫెసర్ వాణిశ్రీ


చిన్నారి బరువు కొలుస్తున్న ఫార్మసీ విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సత్ఫలితాలు సాధిస్తారని ఎన్ఐఆర్డీ (జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ) ప్రొఫెసర్ వాణిశ్రీ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గులలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార లోపంపై మూన్ రే ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నేరళ్ల చెరువు, నల్లమెతల తండా, కుందేలుకుంటతండా, చింతగూడ, కడియాలకుంటతండా, తిమ్మాజిపల్లి, పోతురాజుగడ్డతండా, బూరుగడ్డతండాలలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోషకాహార లోపం నిర్ధారించే ఎత్తు, బరువు కొలతలను చేపట్టారు. పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ వాణిశ్రీ మాట్లాడుతూ.. పోషకాహార లోపం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల, మానసిక పరిస్థితి సక్రమంగా ఉందన్నారు. దీంతో ఏకాగ్రత క్షీణిస్తుందన్నారు. విద్య లేకపోతే భవిష్యత్‌లో ఉపాధి మార్గాలు లభించవని, దీంతో ఆ కుటుంబం పేదరికంలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. కార్యక్రమంలో మూన్‌రే ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సీనియర్ ఎడ్యుకేషన్ మేనేజర్ మురళి, మాల్ న్యూట్రీషియన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శంకర్, ప్రగతి సిబ్బంది లావణ్య, తులసి, శ్వేత, ప్రగతి, శృతి, శ్రీకాంత్, జగదీష్, కార్తీక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కందిలో యాజమాన్య పద్ధతులు ముఖ్యం

క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త చంద్రకాంత్


రైతులకు అవగాహన కల్పిస్తున్న క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

షాబాద్: రైతులు కంది పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ చంద్రకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలం పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో ప్రథమ శ్రేణి క్షేత్ర పథకంలో భాగంగా రైతులకు అధిక దిగుబడి నిచ్చే టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది-3 రకం విత్తనాలు ఇచ్చి సాగు చేయించారు. ఈ సందర్భంగా క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంది పంట క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది-3 రకం కంది విత్తనాలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. కూరగాయలు, పండ్లు, పూల పంటల ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. డాక్టర్లు గౌతమ్‌చౌహాన్, శ్రీకృష్ణ మాట్లాడుతూ... శాస్త్రవేతలు సూచించిన సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ... రైతు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు ప్రయోజనాల గురించి వివరించారు. రైతులకు నేలల సారవంతానికి పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియ దున్నడం, జీవన ఎరువులు, పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి రామకృష్ణ, ఏఓ వెంకటేశం, అధికారులు సాయివర్ధన్, సాయికుమార్, రైతులు అనంతరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాధవరెడ్డి, సురేష్, రఘు, మధసూదన్‌రెడ్డి, మాణిక్యం, మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల డిమాండ్లు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నేతలు

షాద్‌నగర్: రెండవ ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం షాద్‌నగర్ నుంచి రెండవ ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి జిల్లా కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రెండవ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఎన్‌ఎంలు పోరాటం చేస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో ఏఎన్‌ఎంలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏళ్లుగా ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. సలహాలు, సూచనలు అందజేస్తున్నారన్నారు. అలాంటి వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం నాయకులు పద్మ, జయమ్మ, ఏఐటీయూసీ నాయకులు సామిడి శేఖర్, చంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేద్దాం

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామస్వామి

మొయినాబాద్‌రూరల్: జిల్లా మహాసభలను విజయవంతం చేసుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల లేబర్ అడ్డా పరిధిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన జరిగే భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి ప్రపంచానికే గర్వకారణం

- అనుచరులను ప్రోత్సహించడమే నాయకుల లక్షణం
- ఐఐఎం, కొజికోడ్ డైరెక్టర్ దెబాషిశ్ ఛటర్జీ

శంకర్‌పల్లి: భారతదేశ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్), కొజికోడ్ డైరెక్టర్ దెబాషిశ్ ఛటర్జీ అన్నారు. దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరవగా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. 'గ్లోబలైజేషన్ ఇండియన్ థాట్స్- ఇన్‌సైట్స్ ఫ్రం లీడర్‌షిప్ క్రానికల్స్' అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఛటర్జీ మాట్లాడుతూ.. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, భాషలు ప్రతి ఒక్కరికి ఎంతో పరిజ్ఞానాన్ని అందిస్తాయని, అందుకే ఎంతో మంది భారతీయులు విదేశాల్లో రాణిస్తూ గొప్ప పదవుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ప్రపంచంలోని పేరుగాంచిన సంస్థలన్నింటినీ భారతీయులే ముందుండి నడిపిస్తుండటం గర్వించదగిన విషయమన్నారు. ఏ నాయకుడికైనా ఓ పంథా అంటూ ఏమీ ఉండదని, ఎల్లప్పుడూ తన అనుచరులను ప్రోత్సహిస్తూ, ముందుకు సాగడమే నాయకుడి లక్షణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ సొసైటీ చైర్‌పర్సన్ శోభారాణియశస్వీ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎల్ఎస్ గణేశ్, సంస్థ విశిష్ట సలహాదారుడు మహేందర్‌రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్సలర్ డాక్టర్ బీజేరావు, రిజిస్ట్రార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

షాద్‌నగర్‌రూరల్: బిహార్ నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సంఘటన పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం పహడిపూర్ గ్రామానికి చెందిన శిబుఆలం మండల పరిధిలోని బూర్గుల శివారులో పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శిబుఆలం బిహార్ నుంచి రైలులో గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తుంటాడు. బూర్గుల శివారులో వలస కార్మికులకు గంజాయిని అమ్ముతుంటాడు. ఈ క్రమంలో పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో శంషాబాద్ ఎస్ఓటీ, స్థానిక పోలీసులు శిబుఆలంను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 268 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: పుట్టింటికి వెళ్లొచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌కు చెందిన గ్రీన్ హోమ్స్ కాలనీలో నివాసం ఉండే హలీమా గత నెల 31వ తేదీన అత్తాపూర్‌కు తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం నాదర్‌గుల్‌కు వచ్చింది. ఇంటి తాళం తీయడానికి చూడగా మెయిన్‌డోర్ విరగగొట్టి ఉంది. లోపలికి వెళ్లగా కబోర్డులో ఉన్న 5 తులాల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు, కొంత నగదు దొంగిలించినట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.